
మేడారంలో రోడ్లపైనే ప్లాస్టిక్ చెత్త

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం ఏది?

ప్రచారమే తప్ప ఆచరణలో విఫలం

- మేడారం జాతరలో విచ్చలవిడిగా వాడకం
- నాలుగు రోజుల్లోనే 2,500 టన్నులకు పైగా చెత్త ఉత్పత్తి
- వీటిలో 1,250 టన్నులకు పైగా ప్లాస్టిక్ వ్యర్థాలే..
- గాజు బాటిళ్లు, జంతు వ్యర్థాలతో వాతావరణ కాలుష్యం
- భవిష్యత్తు తరాలకు ప్రమాదమంటున్న నిపుణులు

వరంగల్, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఫ్రీ ప్లాస్టిక్ జాతర.. ఇది ప్రతీ మేడారం మహజాతర ముందు ఓ ఊత పదంగా మారింది. ప్లాస్టిక్ నియంత్రణపై ప్రచార్భాటం తప్ప.. ఆచరణలో మాత్రం ఎవరూ శ్రద్ధ చూపటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. లక్షలాదిగా తరలివస్తున్న భక్తులతో మేడారంలోని పచ్చని అడవుల్లో టన్నుల కొద్ది ప్లాస్టిక్ పోగవుతోంది. ప్లాస్టిక్ ఫ్రీ జాతర.. హరిత మేడారం.. ఇలా ఎన్నో పేర్లతో మేడారానికి ప్లాస్టిక్ తీసురావొద్దనే ప్రచార్భాటం ప్రతీసారి జరుగుతున్నప్పటికీ, ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవటం లేదు. ప్లాస్టిక్‌కుతోడు లక్షలాది జంతువుల వ్యర్థాలు, గాజు సీసాలతో వాతావరణ కాలుష్యం మరింత దెబ్బతింటోంది. 'ఫ్రీ ప్లాస్టిక్ మేడారం' నినాదమిచ్చే అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నేతలే విచ్చల విడిగా జాతరలో ప్లాస్టిక్ ఫ్లెక్సీలు పెడుతూ ఏం సందేశం ఇస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

ప్లాస్టిక్ ఫుల్ మేడారం

మేడారం జాతరకు వచ్చే భక్తుడి చేతిలో ప్లాస్టిక్ దర్శనమిస్తుంటుంది. ప్లాస్టిక్ వాటర్ బాటిల్, ప్లాస్టిక్ కూల్‌డ్రింక్స్ బాటిల్స్, చివరకు తల్లులకు సమర్పించే బెల్లం బుట్టకు కూడా ప్లాస్టిక్ కవర్ దర్శనమిస్తుంది. ప్లాస్టిక్ వినియోగం లేకుండా ఏ ఒక్క భక్తుడు కనిపించడంటే అతియోశక్తి కాదు. ఇక లక్షలాదిగా తరలివచ్చే భక్తులతో మేడారం అడవిప్రాంతం మొత్తం ప్లాస్టిక్‌తో నిండిపోతుంది. ఓవైపు ప్లాస్టిక్ నిషేధానికి ప్రపంచవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమమే నడుస్తోంది. భూమిలో కూరుకుపోయిన ప్లాస్టిక్ మట్టిలో కలిసిపోయేందుకు వందేళ్లకు పైగా సమయం పట్టవచ్చు. ఇలాంటి పరిస్థితుల్లో మహాజాతరతో మేడారం పరిసరాలు ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని పర్యావరణ ప్రేమికులు అభిప్రాయపడుతున్నారు. భూకంపాలు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్లాస్టిక్‌ను నియంత్రించాలని సూచిస్తున్నారు.


ప్లాస్టిక్ కాలకేయ(ఫైల్)

ఎక్కడి చెత్త అక్కడే పూడ్చివేత

మహాజాతర సందర్భంగా వేల టన్నుల్లో పోగవుతున్న చెత్తను స్థానింగా ఉన్న అడవుల్లోనే పూడ్చివేయటం లేదా కాల్చి వేయడం చేస్తున్నారు. మేడారానికి చుట్టు పక్కల ఉన్న నార్లాపూర్, కొంగలగుట్ట, గుడ్డేలుగు గుట్ట, రెడ్డిగూడెం, ఊరట్టం తదితర ప్రాంతాల్లో ఉన్న అడవుల్లో భారీ గుంతలు తవ్వుతుంటారు. ప్రతీ మహాజాతరలో ఉత్పత్తి అయ్యే కోళ్ల, మేకలు, గొర్రెలు వంటి వాటి వ్యర్థాలు, కొబ్బరి చిప్పలు, బియ్యం, బెల్లం, గాజులు తదితర వాటిని ఇందులో వేసి పూడ్చి పెడుతుంటారు. 2022 మహాజాతరలో సుమారు 3లక్షల మేకలు, గొర్రెలు, కోళ్లు తెగినట్లుగా అంచనా. వీటి వ్యర్థాలన్నీ కూడా భూమిలో పూడ్చేశారు. ఇక ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లతో పాటు ఇతర ప్లాస్టిక్ సంబంధించిన చెత్తను కాల్చి వేస్తుంటారు. దీంతో జంతువుల వ్యర్థాలను పూడ్చి వేసిన ప్రాంతాల్లో భూగర్భ జలాలు కాలుష్యం కాటుకు గురవుతున్నాయి.


మేడారంలో రాజకీయ నాయకుల ఫ్లెక్సీలు

గాజు సీసాలతో ప్రమాదం

మహాజాతరలో పోగవుతున్న ప్లాస్టిక్‌తో భారీ ముప్పు వాటిల్లుతుందనే భయాందోళనలు ఉన్నాయి. నిపుణుల అంచనా ప్రకారం పాలిథిన్ కవర్ నుంచి పీవీసీ పైపుల వరకు గత జాతరలో 1,021 టన్నుల ప్లాస్టిక్ చెత్త ఇక్కడ చేరినట్లుగా గుర్తించారు. ఇందులో సన్న ప్లాస్టిక్ కవర్ల వాటా ఏకంగా 200టన్నులుగా నమోదైనట్లుగా సమాచారం. సుమారు 2వేల మందికి పైగా పారిశుధ్య కార్మికులు శ్రమించినప్పటికీ జాతర ప్రాంతంలోని పొలాల్లో ప్లాస్టిక్ కవర్లు పేరుకుపోతున్నాయి. డంపింగ్ యార్డుల్లో నిల్వచేసిన చెత్త నుంచి ప్లాస్టిక్ కవర్లు గాలిలో కొట్టుకపోయి అడవుల్లో పరుచుకుంటున్నాయి. ఇలా అడవుల్లో, పొలాల్లో కనిపించే ప్లాస్టిక్‌ను తినటం వల్ల పశువులు, ఇతర జంతువులు అనారోగ్యం పాలవుతున్నట్లుగా అధికారులు గుర్తిస్తున్నారు. డంపింగ్ యార్డుల్లో నిల్వ చేసిన ప్లాస్టిక్‌ను మండించటం వల్ల ఏర్పడే పొగతో అడవుల్లో ఉండే జంతువులు, పక్షులపై ప్రభావం పడుతున్నట్లుగా తెలుస్తోంది. మరోవైపు మేడారం మహాజాతరలో మద్యం ఏరులైపారుతోంది. జాతర ముగిసిన తరువాత లక్షల్లో గాజు మద్యం బాటిళ్లు దర్శనమిస్తాయి. మహాజాతరలో పోగవుతున్న వ్యర్థాల్లో సుమారు 100టన్నులకుపైగా బాటిళ్ల వ్యర్థాలే ఉన్నట్లుగా అధికారులు లెక్కలు వేస్తున్నారు. వీటిలో 50శాతం వరకు బాటిళ్ల రీసైక్లింగ్ అవుతుండగా, మిగతా 50శాతానికిపైగా బాటిళ్లు జాతర అవరణలో పగిలిపోతున్నాయి. ఇలా జాతర జరిగే ప్రాంతాల్లో గాజు పెంకులు ఉండటం వలన పొలాల్లోకి వెళ్లే రైతులకు, కూలీలకు, పశువులకు గాయాలు చేస్తున్నాయి.

ప్రచారమేనా.. ఆచరణేది..?

ఫ్రీ ప్లాస్టిక్ మేడారం జాతరగా విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. ప్రతీ జాతర ముందు ఇలాగే ప్రచారం చేయడం.. జాతర సమయంలో ప్లాస్టిక్ రాకుండా ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా చేతులు ఎత్తివేయటం అనవాయితీగా వస్తోందనే విమర్శలున్నాయి. ప్లాస్టిక్ కవర్లకు బదులు పేపర్ బ్యాగులు, జనుప సంచులను వినియోగించేలా భక్తులకు అవగాహన కల్పించడంలో అధికారుల వైఫల్యం చెందుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే జాతరలో ప్లాస్టిక్ విక్రయించే షాపులపై దాడులు నిర్వహించకుండా ఎలా ప్లాస్టిక్‌ను అరికడతారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. చిత్తశుద్ధితో ప్లాస్టిక్‌ను అరికట్టకుంటే మేడారంలోని భావితరాలకు భవిష్యత్తు అంధకారంగా మారే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

జాతరంతా చెత్తనే..

మేడారం మహజాతర జరిగే నాలుగు రోజుల్లోనే 2వేల టన్నులకు పైగా చెత్త పోగవుతుంది. 2022 మహజాతరలో చెత్త భారీగా పోగైంది. జాతర జరిగిన ఆ నాలుగు రోజుల్లో 2,600టన్నుల చెత్తను గుర్తించగా, ఇందులో 1,021టన్నులు ప్లాస్టిక్, 420టన్నులకు పైగా జంతు వ్యర్థాలు పోగైనట్లుగా అధికారులు గుర్తించారు. మిగతా చెత్తలో భూమిలో తేలికగా కలిసిపోయే బియ్యం, బెల్లం, కొబ్బరి, ఆహారవ్యర్థాలు తదితరాలు ఉన్నాయి. 52శాతం భూమిలో కలిసి పోయే చెత్త ఉండగా, ఇక భూమిలో తేలికగా కలిసిపోని ప్లాస్టిక్ 48శాతం వరకు ఉంది. వందల ఏళ్ల వరకు కూడా భూమిలో కలిసిపోలేని ప్లాస్టిక్ ప్రతీ జాతర సందర్భంగా మేడారం పరిసరాల్లో పోగవుతోంది. పచ్చని అడవుల్లో భూమిలో కలిసిపోయిన ప్లాస్టిక్‌తో భవిష్యత్తులో భారీ నష్టాలు ఉంటాయనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది.

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024


వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

భక్తజన సంద్రంగా మేడారం



- తల్లుల దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- వందల వాహనాలతో నిండిపోయిన పార్కింగ్‌లు

మేడారం, ఫిబ్రవరి 18: వనదేవతలు సమ్మక్క,సారలమ్మలను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆదివారం తరలివచ్చారు. మహాజాతరకు ముందే తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. వారాంత సెలువు కావడంతోపాటు మహాజాతరకు మరో రెండు రోజుల సమయం ఉండడంతో తెలంగాణ నలుమూలలతో పాటు ఇతర రాష్ట్రాల భక్తులు మేడారం తరలివచ్చారు. దీంతో గద్దెల ప్రాంగణం అమ్మవార్ల నామస్మరణతో మార్మోగింది. రద్దీ అధికంగా ఉండడంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ, పోలీసు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. క్రమ పద్ధతిలో క్యూలైన్ల ద్వారా భక్తులు అమ్మవార్ల గద్దెలను సులభంగా దర్శించుకొని వెళ్లేలా పోలీసు అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. ఆదివారం 10 లక్షల మందికిపైగా భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు.


వనదేవతలను దర్శించుకునేందుకు వెళ్తున్న శివసత్తి

కిటకిటలాడిన పార్కింగ్ స్థలాలు

మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి ఆదివారం తరలివచ్చిన లక్షల మంది భక్తుల వేల సంఖ్యలో వాహనాలను పోలీసు అధికారులు పార్కింగ్ స్థలాలకు తరలించారు. పస్రా, నార్లాపూర్,

మిగతా 7వ పేజీలో..

నేడు మేడారంలో మంత్రుల పర్యటన

మేడారంలో రాష్ట్ర రెవెన్యూ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క సోమవారం పర్యటించనున్నారు. భక్తులకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించనున్నారు. ఆయా శాఖల అధికారులతో సమావేశమై జాతర నిర్వహణపై సమీక్షించనున్నారు. మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదివారం పరిశీలించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీజ, డీపీవో వెంకయ్య, తహసీల్దార్ రవీందర్ ఉన్నారు.

బయ్యారం ఎస్బీఐ ఏటీఎంలో చోరీ

- రూ. 29 లక్షల అపహరణ
- అంతరాష్ట్ర దొంగలుగా అనుమానం
- స్థలాన్ని పరిశీలించిన ఏఎస్పీ చెన్నయ్య


దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం మిషన్

బయ్యారం (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం బస్టాండ్ సెంటర్‌లోని ఎస్బీఐ ఏటీఎంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. అంతరాష్ట్ర దొంగల ముఠా గ్యాస్ కట్టర్‌తో ఏటీఎం మిషన్‌ను పగలగొట్టి రూ. 29.78 లక్షల డబ్బును ఎత్తుకెళ్లారు. ఈ విషయం తెలుసుకున్న ఏఎస్పీ చెన్నయ్య, డీఎస్పీ తిరుపతి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం పోలీసులు ఆనవాళ్లను సేకరించారు. ఈ వివరాలను ఆదివారం వారు మీడియాకు వెల్లడించారు. కారులో వచ్చిన నలుగురు వ్యక్తులు ఏటీఎం మిషన్‌ను గ్యాస్ కట్టర్‌తో పగలగొట్టి నగదు ఎత్తుకెళ్లారని, చోరీ జరిగిన తీరును బట్టి వారిని అంతరాష్ట్ర ముఠాగా భావిస్తున్నామని అన్నారు. క్లూస్ టీం ద్వారా ఆనవాళ్లు సేకరిస్తున్నామని, త్వరలోనే నిందితులను పట్టుకుంటామని అన్నారు. బ్యాంకు సిబ్బంది, సీఎంఎస్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెవార్ బ్యాచ్ పనేనా..!?

ఈ చోరీ చేసింది హర్యానాకు చెందిన నెవార్ బ్యాచ్ పనేనా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాళం వేసిన ఇళ్లల్లో ఎలాగైతే చెడ్డీ గ్యాంగ్ చోరీకి పాల్పడుతోందో.. ఈ నెవార్ బ్యాచ్ కూడా అదేవిధంగా కేవలం ఏటీఎంలనే టార్గెట్ చేస్తూ చోరీలకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కొంత కాలంగా హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లోని ఏటీఎంలను టార్గెట్ చేస్తూ చోరీలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ముందుగా వీరు ఒక ఏటీఎంను ఎంచుకుని ఆ ప్రాంతంలో కొంత కాలం పాటు రెక్కీ నిర్వహించి, సెల్ టవర్ సిగ్నల్స్‌కు కూడా దొరకకుండా ఫేక్ సిమ్‌లతో సంచరిస్తున్న చాలా జాగ్రత్తగా ఏటీఎంల చోరీకి పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. క్లూస్ టీంకు కూడా ఆనవాళ్లు దొరకుండా ముఠా సభ్యులు చాలా పకడ్బందీగా చోరీలకు పాల్పడుతుండటం పోలీసులకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

నేటి నుంచి లక్నవరం సందర్శన బంద్

గోవిందరావుపేట, ఫిబ్రవరి 18: ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని పర్యాటక కేంద్రం లక్నవరం సరస్సు సందర్శనను తాత్కాలికంగా నిలిపివేస్తున్నారు. మేడారం సమ్మక్క, సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని ఈ నెల 19 నుంచి 26 వరకు బంద్ చేస్తున్నామని, పర్యటకులు ఎవరూ రావద్దని పస్రా ఎస్సై షేక్ మస్తాన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాజాతర సందర్భంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ఈ చర్యలు చేపట్టామని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీ కాలువలో పడి చిన్నారి మృతి


సంజన మృతదేహం

కేసముద్రం, ఫిబ్రవరి 18 : మండలంలోని తౌర్యతండా జీపీ పరిధిలోని మూలస్తంభం వద్ద ఎస్సారెస్పీ కాలువలో నాలుగేళ్ల చిన్నారి మృతదేహాన్ని స్థానికులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. ఘటన స్థలానికి చేరుకున్న వరంగల్ జిల్లా పర్వతగిరి ఎస్సై వీరభద్రరావు తెలిపిన వివరాల ప్రకారం. సిద్దిపేట జిల్లా లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గారడీ ప్రదర్శనలు చేసుకుని జీవించే సమాని రవి-సంధ్య దంపతుల కుమార్తె సంజన (4) పర్వతగిరి మండలం ఇస్లావత్‌తండా సమీపంలో ఎస్సారెస్పీ కాలువలో పడినట్లు తెలిపారు. అక్కడ్నుంచి నీటిలో కొట్టుకు వస్తున్న మృతదేహాన్ని మూలస్తంభం వద్ద స్థానికులు గుర్తించి, వెలికి తీశారు. రెండు గారడీ కుటుంబాలు ఆదివారం ఉదయం ఇస్లావత్‌తండాకు చేరుకుని రాత్రి ప్రదర్శన నిర్వహించేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో మధ్యాహ్నం 3.30 గంటలకు సంజన కన్పించడంలేదంటూ డయల్ 100కు తండవాసులు ఫోన్ చేశారు. ఈ మేరకు సంజన ఆచూకీ కోసం వెతుకుతుండగా కాలువలో మృతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఆ చిన్నారి కాలువలో ఎలా పడిందన్న విషయంపై విచారణ జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు. ఇదిలా ఉండగా బాలికను గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై కిడ్నాప్ చేసి, ఎత్తుకెళ్లి కాలువలో పడేసినట్లు ఇస్లావత్‌తండాలో ప్రచారం జరిగింది.

ఆగేనా.. సాగేనా?

- శంకుస్థాపనకే పరిమితమైన మినీటెక్స్‌టైల్ పార్కు
- గత ప్రభుత్వంలో వస్త్ర పరిశ్రమకు శ్రీకారం
- స్థలాన్ని సేకరించిన అధికారులు
- ప్రభుత్వం మారడంతో ఆగిన పనులు
- ప్రస్తుత ఎమ్మెల్యే చొరవ చూపాలంటున్న చేనేత కార్మికులు


కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు (ఫైల్)

కొడకండ్ల ఫిబ్రవరి 18: మండలకేంద్రంలో మినీ టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడంతో చేనేత కార్మికులు ఆందోళన చెందుతున్నారు. వస్త్ర పరిశ్రమపై తాము పెట్టుకున్న ఆశలు గల్లంతేనా అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ చూపి వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నాలుగు నెలల క్రితం శంకుస్థాపన..

గత సంవత్సరం అక్టోబరు 8న కొడకండ్లలో అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మినీ టెక్స్‌టైల్ పార్కుకోసం శంకుస్థాపన చేశారు. వాస్తవానికి అంతకుముందే టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటుకు అనుమతులు వచ్చినప్పటికీ భూసేకరణ విషయంలో జాప్యం జరిగింది. ఎట్టకేలకు ఎర్రబెల్లి శంకుస్థాపన చేయడంతో కార్మికులలో మొలకెత్తిన అనుమానాలు పటాపంచలయ్యాయి. మొత్తం 64కోట్ల రూపాయలతో నిర్మించతలపెట్టిన ఈ టెక్స్‌టైల్ పార్కుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా కనీసం 5 వేలమందికి ఉపాధి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్, జౌళి శాఖ మంత్రి కేటీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకాలు చేశారు. ఈలోగా ప్రభుత్వం మారడం, కొత్త ప్రభుత్వం ఇంతవరకు ఆ ఊసే ఎత్తకపోవడంతో కార్మికులు, నిరుద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భూసేకరణ..

మినీ టెక్స్‌టైల్ పార్కుకు 70 ఎకరాల భూమి అవసరమని సంబంధిత అధికారులు నిర్ణయించారు. దీనిపై అప్పటి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య, టీఎస్‌ఐఐసి, రెవెన్యూ, సర్వే అధికారులు స్థలాలను పరిశీలించారు. అనంతరం టీఎస్‌ఐఐసీ సంస్థకు కొడకండ్ల - రామవరం మెయిన్ రోడ్డుపైనున్న 9 ఎకరాల 28 గుంటల ప్రభుత్వ భూమిని రెవెన్యూశాఖ అప్పగించింది. మిగతా భూమి కోసం ప్రయత్నించగా చుట్టుపక్కల ప్రైవేటు భూయజమానులు స్థలం ఇవ్వడానికి సుముఖత చూపలేదు. దాంతో మొగుళ్ళచెరువు గుట్ట వద్ద ఉన్న 54 ఎకరాల ప్రభుత్వ భూమిని ఇవ్వడానికి రెవెన్యూశాఖ సంసిద్ధత వ్యక్తం చేసింది. దాంతో మొదట కేటాయించిన 9ఎకరాల 28గుంటల భూమిలో మొదటి ఫేజ్, మిగతా భూమిలో రెండో ఫేజ్ మినీటెక్స్‌టైల్ పార్కును నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ప్రస్తుత ఎమ్మెల్యే చొరవచూపాలి..

మినీ టెక్స్‌టైల్ పార్కుకు శంకుస్థాపన అయ్యాక రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పాలకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఈ విషయంలో చొరవ చూపాలని మండల ప్రజలు కోరుతున్నారు. టెక్స్‌టైల్ పార్కు పనులు త్వరగా పూర్తి చేసి తమకు ఉపాధి కల్పించాలని చేనేత కార్మికులు, నిరుద్యోగులు, చిన్న యూనిట్ల యజమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

"పార్కు ప్రారంభమైతే మాకు పని దొరుకుతుంది.."

దాసరి పల్లవి, చిన్న యూనిట్ యజమాని, కొడకండ్ల



కొడకండ్లలో మినీ టెక్స్‌టైల్ పార్కు ప్రారంభమైతే మాకు పనిదొరుకుతుంది. ఈ విషయంలో ప్రస్తుత ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరువ చూపి త్వరగా పనులు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నాము. టెక్స్‌టైల్ పార్కు ఏర్పాటైతే ప్రత్యక్షంగా మాలాంటి చిన్న యూనిట్ యజమానులకు, కార్మికులకు, నిపుణులకు పరోక్షంగా మా దగ్గర వస్త్రాలు కొని అమ్ముకునే వాళ్ళకు, ట్రాన్స్‌పోర్ట్ వ్యాపారులకు జీవా నోపాధి కలుగుతుంది.

"కొడకండ్ల అభివృద్ధి చెందుతుంది.."

పసునూరి మధుసూదన్, పద్మశాలి నేత, కొడకండ్ల



రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో టెక్స్‌టైల్ పార్కు పనులు ఆగిపోయాయి. నిర్మాణం పూర్తై ఈ పార్కు అందుబాటులోకి వస్తే కొడకండ్ల మండలమేకాక చుట్టుపక్కల మండలాల ప్రజలకు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి దొరుకుతుంది. అందువల్ల రాజకీయాలకు అతీతంగా ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి చొరవ చూపి పనులు ప్రారంభమయ్యేలా చూడాలి.

ఉద్యమకారులను హేళన చేసిన బీఆర్ఎస్

- కాంగ్రెస్ పార్టీ వారికి అండగా ఉంటుంది
- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సుబేదారి, ఫిబ్రవరి 18: గత బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారులను అవహేళన చేసిందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. తెలంగాణ ఆకాంక్షల వేదిక ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కేంద్రం సుబేదారిలోని ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కళాశాల ఆడిటోరియంలో ఆదివా రం తెలంగాణ ఉద్యమకారుల, కళాకారుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలను గౌరవించి వారికి న్యాయం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను అవహేళన చేసి అవమాన పరిచిందన్నారు. ఎప్పుడైతే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉద్యమకారులను విస్మరించారో, ఉద్య మ లక్ష్యాలను పట్టించుకోలేదో ప్రజలకు దూరమై ఓటమి పాలయ్యారన్నారు. కాంగ్రెస్ విజయం ఉద్యమకారుల, నిరుద్యోగ యువకుల విజయం అన్నారు.

కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఉద్యమకారుల భద్రత కోసం ఇంటి స్థలాల కేటాయింపు, కేసుల ఎత్తివేత మొదలైన భద్రత కోసం వాగ్దానం చేసిందని, వాటిని తప్పనిసరిగా నెరవేరుస్తామన్నారు. ఈ సమావేశంలో పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తెలంగాణ ఆకాంక్షల వేదిక అధ్యక్షుడు సూరి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ రియాజ్, ఉద్యమ నేతలు గాదె ఇన్నయ్య, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పృథ్వీరాజ్, కాంగ్రెస్ నాయకురాలు కూచన రవళి, కుమార్, అజయ్, శోభ పాల్గొన్నారు. కాగా, బుల్లెట్ వెంకన్న, దారా దేవేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



యునెస్కో గుర్తింపు వచ్చేనా?

- మేడారం జాతరకు అర్హత ఉందంటున్న నిపుణులు
- కొంత కృషి చేసిన కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్
- యునెస్కో గుర్తింపు లభిస్తే జాతరకు ప్రపంచవ్యాప్త గుర్తింపు

హనుమకొండ, ఫిబ్రవరి 18 (ఆంధ్రజ్యోతి) : విశిష్టమైన చారిత్రక నేపథ్యం కలిగిన సమ్మక్క-సారలమ్మ జాతరకు యునెస్కో గుర్తింపు లభించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రభుత్వం తలుచుకుంటే రామప్పకు మాదిరిగానే ఈ జాతరను కూడా ప్రపంచవారసత్వ సంపద జాబితాలో చేరేట్టు చేయడం అసాధ్యమేమీ కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు కోటిమందికిపైగా హాజరవుతుండడంతో ఇప్పటికే ప్రపంచం దృష్టిని ఆకర్శించినందువల్ల యునెస్కోను ఒప్పించడానికి వీలున్నదంటున్నారు. సమ్మక్క-సారలమ్మ జాతర పూర్తిగా ప్రకృతితో మమేకమై జరిగే గిరిజన పండుగ ఇది ఇంటాంజియబుల్ హెరిటేజ్ కేటగిరి కిందకు వస్తుంది. ఈ నేపథ్యంలో మేడారం జాతరకు కూడా యునెస్కో వారసత్వ హోదా లభించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర అనేక విశిష్టతలతో కూడిన సమాహారం. అక్కడ దేవాలయం ఉండదు. మారుమూల దట్టమైన అడవి మధ్యలో ప్రకృతి ఒడిలో కేవలం గద్దెలపైన కుంకుమ భరిణ రూపంలో సమ్మక్క - సారలమ్మ తల్లులు ఉంటారు. లక్షలాది మంది భక్తులు వచ్చి తల్లులను కొలుస్తారు. వనదేవతలపై భక్తుల్లో ఉన్న ప్రగాఢ నమ్మకానికి ప్రతీక ఈ జాతర. ఈ పరంపర కొన్ని వందల ఏళ్ల నుంచి వస్తోంది. ఇన్ని లక్షల మంది రెండేళ్లకు ఒక సారి వస్తున్నారంటే దీని వెనుక ఏదో అతీతమైన అద్భుత శక్తి ఉందనుకోవాలి. ఈ కోణం నుంచే జాతర విశిష్టత, వైవిధ్యాన్ని ఎత్తి చూపడం ద్వారా యునెస్కో గుర్తింపునకు కృషిచేయాలి. ఇందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాల్సి ఉంటుంది.

ఇప్పటికే కొంత కృషి

జాతర వైశిష్ట్యాన్ని ప్రపంచానికి తెలియచేయడానికి కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ ఇప్పటికే చాలా కృషి చేసింది. జాతరపై ఇంగ్లీష్, తెలుగు భాషల్లో కాఫీ టేబుల్ బుక్‌ను ముద్రించింది. జాతరపై సమగ్ర సమాచారంతో కూడిన పుస్తకాన్ని ప్రచురించింది. జాతర గొప్పతనాన్ని ప్రతిబింబించేలా డాక్యుమెంటేషన్ కూడా చేసింది. అయితే రామప్పలాగా డోసియర్ తయారు చేయాల్సి ఉంది. ఇందుకు చాలా ఖర్చవుతుంది. ఎంతో మంది ఇందులో భాగస్వాములు కావలసి ఉంటుంది. జాతరకు సంబంధించిన ఏ చిన్న అంశం విడిచి పెట్టకుండా అంతర్జాతీయ సమాజం దృష్టికి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. ఈనెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జాతర జరుగునున్న దృష్ట్యా యునెస్కో గుర్తింపు కోసం ప్రయత్నాలను మొదలు పెడితే రామప్పకు తరహాలో మేడారం జాతరకు కూడా యునెస్కో గుర్తింపు లభించగలదన్న విశ్వాసంతో భక్తులు ఉన్నారు.



నిపుణులతో కమిటీ

జాతరకు యునెస్కో గుర్తింపు సాధించడానికి అవసరమైన ప్రాతిపదిక సౌకర్యాలను కల్పించాలి. పూర్వానుభవం కలిగిన తగిన వ్యక్తులను ఎంపిక చేసి వారితో కేంద్ర పురావస్తుశాఖ, రాష్ట్ర పురావస్తుశాఖ, దేవాదాయ శాఖ, పర్యాటక శాఖ, ఇతర సాంకేతిక విభాగాలలో నిష్ణాతులైన వారితో ఒక కమిటీని వేయాలి. ఈ మేరకు ఒక డోసియర్‌ను తయారు చేయాలి. ముందు టెంటెటివ్ లిస్టులోకి వెళ్లాలి. అప్పుడే యునెస్కోలో పరిధిలోకి జాతరను తీసుకు వెళ్లడానికి మంచి అవకాశాలుంటాయి.

క్రైటేరియాను గుర్తించాలి

యునెస్కోలో గుర్తింపునకు ముందు క్రైటేరియాను గుర్తిచాలి. యునెస్కో గైడ్‌లైన్స్ చాలా సంక్లిష్టంగా ఉంటాయి. ఇంటాంజియల్ హెరిటేజ్‌గా పరిగణించే సమ్మక్క-సారలమ్మ జాతర యునెస్కోలో ఏ గైడ్‌లైన్స్‌కు కిందికి వస్తుందో గుర్తించాలి. రామప్ప దేవాలయం విషయంలో గైడ్‌లైన్స్‌లో ఒకటి, మూడు తీసుకున్నారు. అలాగే మేడారం జాతర విషయంలో కూడా గైడ్‌లైన్స్‌ను చాలా జాగ్రత్తగా గుర్తించాలి. ఆ మేరకు సమగ్ర సమాచారంతో కూడిన డోసియర్‌ను తయారు చేయాలి. జాతరకు యునెస్కో గుర్తింపు లభించినట్లయితే ప్రత్యేకంగా నిధులంటూ ఏమీ రాకపోయినా బ్రహ్మాండమైన అంతర్జాతీయ గుర్తింపు వస్తుంది. ప్రపంచం నలుమూలల నుంచి పర్యాటకులు వస్తారు. యునెస్కో గుర్తింపువల్ల గిరిజన జాతరపై పరంపరపై ఎలాంటి ప్రతికూల ప్రభావమూ పడదు, జాతర సంప్రదాయాలు యథావిధిగా కొనసాగుతాయి. జాతర నిర్వహణలో ఎలాంటి మార్పు ఉండదు.

డోసియర్ కీలకం

మేడారం జాతరను యునెస్కో పరిధిలోకి తీసుకురావాలంటే ముందు సమగ్రమైన డోసియర్‌ను రూపొందించాలి. ఇదేకీలకం. దీనినిబట్టే గుర్తింపు లభిస్తుంది. డోసియర్ తయారు చేయడం అంత సులభం కాదు. ఇందుకు చాలా కసరత్తు చేయాల్సి ఉంటుంది. అనేకమంది నిపుణులను భాగస్వాము లను చేయాల్సి ఉంటుంది. రామప్ప విషయంలో ఇలాగే జరిగింది. డోసియర్ తయారు చేయడానికి చాలాఏళ్లు పట్టింది. పైగా ఎంతో ఖర్చుతో కూడుకున్న పని. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారం లేకుండా డోసియర్‌ను తయారు చేయడం కష్టం.


యునెస్కో గుర్తింపు సాధ్యమే

రిటైర్డ్ ప్రొఫెసర్ పాండురంగారావు, కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ కన్వీనర్



మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరను ప్రపంచ వారసత్వ సంపదగా యునెస్కో గుర్తింపు లభించేలా చేయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలి. రామప్పలాగా ఈ గిరిజన జాతరపై డోసియర్ తయారు చేయాలి. ఏ క్రైటేరియా కిందకు దీనిని తీసుకురావాలో నిర్ధారించాలి. అందుకు ప్రాతిపదికను రూపొందించాలి. లోతుగా పరిశోధన జరపాలి. జాతర విశేషాలను, ప్రత్యేకతలను అన్ని కోణాల నుంచి రికార్డు చేయాలి. ఇందుకు ప్రత్యేక కమిటీలను వేయాలి. మేడారం జాతరపై కాకతీయ హెరిటేజ్ ట్రస్ట్ పక్షాన అద్భుతమైన ఛాయాచిత్రాలు, సమగ్ర సమాచారంతో కూడిన కాఫీ టేబుల్ బుక్‌ను తెలుగు, ఇంగ్లీష్ బాషల్లో ఇది వరకే తీసుకు వచ్చాం. జాతర చరిత్రను తెలిపే పుస్తకాన్ని కూడా ముద్రించాం. మేడారం జాతరకు యునెస్కో గుర్తింపు దిశగా కొంత పని అయితే ప్రాథమికంగా చేశాం. ఈ జాతర ఇంటాంజియల్ హెరిటేజ్ లేదా లివింగ్ హెరిటేజ్ కిందకు వస్తుంది. సమ్మక్క - సారలమ్మ జాతర ఈ నేలపై పరిఢవిల్లుతున్న ఒక ఆదివాసీ ప్రాచీన సాంస్కృతిక సజీవ వారసత్వ సంపద. ఈ కోణం నుంచి సరిగా ప్రాజెక్టు చేయగలిగితే జాతరకు యునెస్కో గుర్తింపు లభించడం సాధ్యమే.

మేడారం రూట్ మ్యాప్



మేడారానికి దారి అదిగో..

ములుగు, ఫిబ్రవరి 18: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు చేరుకునేందుకు జిల్లా పోలీసు శాఖ రూట్ మ్యాప్‌ను విడుదల చేసింది. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసారి కూడా వన్‌వే అమలు చేస్తున్నారు. ఆర్టీసీ, వీవీఐపీ, వీఐపీ వాహనాలను తాడ్వాయి మీదుగా మేడారం అనుమతిస్తుండగా ప్రైవేటు వాహనాలకు మేడారం నలువైపులా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆయా రూట్లలో వచ్చే వాహనాలు నిలిపేందుకు సుమారు 1,500 ఎకరాల్లో పార్కింగ్ స్థలాలను పోలీసులు ఏర్పాటు చేశారు. అక్కడ లైటింగ్, తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించారు.

- వరంగల్ వైపు నుంచి మేడారం వెళ్లే వాహనదారులు హనుమకొండ, గూడెప్పాడ్, ములుగు, పస్రా, నార్లాపూర్ మీదుగా మేడారం చేరుకోవాలి. తిరుగు ప్రయాణంలో బయ్యక్కపేట, కమలాపురం క్రాస్‌రోడ్డు, పరకాల, గూడెప్పాడు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది.
- మహారాష్ట్ర, రామగుండం నుంచి వచ్చే వాహనదారులు కాటారం, చింతకాని, యామన్‌పల్లి, పెగడపల్లి, కాల్వపల్లి మీదుగా మేడారం చేరుకోవాలి. అదే దారిలో తిరుగు ప్రయాణం చేయాల్సి ఉంటుంది
- ఛత్తీస్‌గడ్, భద్రాచలం, కొత్తగూడెం నుంచి వచ్చే వారు ముల్లకట్ట, ఏటూరునాగారం, చిన్నబోయినపల్లి, దొడ్ల, కొండాయి మీదుగా ఊరట్టం నుంచి మేడారం చేరుకోవాలి. ఇదే దారిలో తిరుగు ప్రయాణం చేయాలి.

పగిడిద్దరాజు ఆలయాన్ని అభివృద్ధి చేస్తా

- ఈ ఏడాది అధికారిక లాంఛనాలతో స్వామి వారిని మేడారానికి తీసుకెళ్తాం..
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క



పగిడిద్దరాజు ఆలయంలో స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న మంత్రి సీతక్క

గంగారం(మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి 18 : గిరిజనుల ఆరాధ్య దైవం.. సమ్మక్క పెనిమిటి పగిడిద్దరాజు ఆలయాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువైయున్న పగిడిద్దరాజు ఆలయంలో ఆదివారం మేడారం సమ్మక్క, సార్లమ్మ ఆలయం బోర్డు చైర్మన్ లచ్చు పటేల్ ద్వారా స్వామి వారికి తీసుకువచ్చిన పట్టువస్త్రాలను ప్రధాన తలపతి(అర్చకుడు) పెనక రాజేశ్వర్‌కు అందచేశారు. అనంతరం ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తలపతులకు పట్టు వస్త్రాలను ఇచ్చి, సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మారుమూలన ఉన్న పగిడిద్దరాజు ఆలయాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. భక్తులకు అవసరమైన మంచినీటి వసతి యుద్ధప్రాతిపదికంగా ఏర్పాటు చేయాలని మిషన్ భగీరథ ఏఈ నరేష్‌ను ఆదేశించారు. భగీరథ నుంచి నీరు రానిపక్షంలో బోరు బావులనుంచైనా ఆలయానికి మంచినీరు వసతి ఏర్పాటు చేయాలన్నారు. పగిడిద్దరాజు ఉండే వనం గుట్టకు ఇనుప కంచే ఏర్పాటు చేస్తానన్నారు. వనం వరకు సీసీ రోడ్డుకాని బీటీ రోడ్డు కానీ ఏర్పాటు చేస్తానన్నారు.

ఈ ఏడాది పగిడిద్దరాజుని పెండ్లి కుమారుడిగా అధికార లాంచనాలతో సమ్మక్క గద్దెకు తీసుకు వెళ్తామని ధనసరి సీతక్క తెలిపారు. మరుగుదొడ్ల మరమతులు చేయటమే కాకుండా, ఆలయం ప్రాంగణంలో భక్తులు ఉండేలా షెడ్లు, వంటగదులు నిర్మాణం చేస్తామన్నారు. పూనుగొండ్ల నుంచి దుబ్బగూడెం వరకు రహదారి, పూనుగొండ్ల నుంచి కరుణగండి మీదుగా కొత్తగూడకు బీటీ రోడ్డు ఏర్పాటుకు చేయాలని గిరిజనులు వినతి పత్రమిచ్చారు. చివరిగా మంత్రి సీతక్కకు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు శాలువాతో సత్కరించారు. మంత్రి పదవి చేపట్టిన తర్వాత తొలిసారి గంగారం మండలం రావటంతో పూనుగొండ్ల ఆడబిడ్డలతో కాసేపు ముచ్చటించారు. ఎవరికి ఏ కష్టం వచ్చినా మీ ఇంటి బిడ్డగా తనతో చెప్పుకోవాలని కోరారు. వివిధ సమస్యల వినతి పత్రాలు స్వీకరించారు. పదేళ్ల నుంచి రెండో ఏఎన్ఎంలుగా పనిచేస్తున్నాము తమకు రెగ్యులర్ చేయాల ని కోరుతూ స్థానిక ఏఎన్ఎంలు వినతి పత్రాలను ఇచ్చారు.

కార్యక్రమంలో ఏటూరునాగారం ఐటీడీఏ పీవో అంకిత్, డీడీ మంకిడి ఎర్రయ్య, డీఎస్పీ తిరుపతిరావు, గూడూరు సీఐ బానోత్ రాజునాయక్ గంగారం ఎస్ఐ దిలీప్, ఐటీడీఏ ఏఈ రవి, ఎంపీపీ సువర్ణపాక సరోజన, జడ్పీటీసీ ఈసం రమ, వైస్ ఎంపీపీ సువర్ణపాక సరోజన, వజ్జా సారయ్య, చల్లా నారాయణ రెడ్డి, పగిడిద్దరాజు ఆలయ తలపతులు పెనక రాజేశ్వర్, పురుషోత్తం, రామస్వామి, సురేందర్, లక్ష్మీనర్సు పాల్గొన్నారు.



ఆలయంలోని సమ్మక్క సారలమ్మ గద్దెలకు పూజలు చేస్తున్న సీతక్క

సేవాభావంతో విధులు నిర్వర్తించాలి

- మేడారం జాతర విధుల్లో 15వేల మంది సిబ్బంది
- టీఎస్ ఆర్టీసీ ఎమ్డీ వీసీ సజ్జనార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఎమ్డీ సజ్జనార్

సుబేదారి, ఫిబ్రవరి 18 : మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరలో ఆర్టీసీ సిబ్బంది సేవాభావంతో విధులు నిర్వర్తించాలని టీఎస్‌ఆర్టీసీ ఎం.డి. వీసీ సజ్జనార్ ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఆరెపల్లి అయ్యప్ప టెంపుల్ సమీపంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీ (జెడ్ఎస్టీసీ)లో ఆదివారం మేడారం జాతర నిర్వహణపై టీఎస్‌ఆర్టీసీ సిబ్బంది, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్డీ సజ్జనార్ హాజరై మాట్లాడారు. మేడారం జారతలో సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించి భక్తులకు నాణ్యమైన, మెరుగైన సేవలు అందించాలన్నారు. భక్తులకు రవాణాపరంగా ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరలో సిబ్బందికి కేటాయించిన స్థానాలలో మాత్రమే విధులు నిర్వహించేలా అధికారులు చూడాలని సూచించారు. భక్తులకు నిస్వార్థమైన సేవలు అందించి సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటుందని, సిబ్బంది దీనిని ఒక చాలెంజ్‌గా తీసుకుని జాతరలో ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేయాలన్నారు. జీరోఫెయిలూర్స్‌తోపాటు యాక్సిడెంట్ ఫ్రీగా జాతర జరిగేలా ప్రతీ ఒక్క సిబ్బంది కృషి చేయాలన్నారు. మేడారం జాతరలో 15వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వర్తించాలని, వారికి వసతి సౌకర్యం, భోజనం విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని అధికారులకు సజ్జనార్ సూచించారు.

ఈ సందర్భంగా మేడారం జాతరలో విధులు నిర్వర్తించే ఆర్టీసీ సిబ్బంది కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో రూపొందించిన టీషర్టులను సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ సమావేశంలో టీఎస్ ఆర్టీసీ సీవోవో డాక్టర్ రవీందర్, జాయింట్ డైరెక్టర్ అపూర్వ రావు, ఈడీలు మునిశేఖర్, కృష్ణకాంత్, వెంకటేశ్వర్లు, రఘునాథరావు, వరంగల్ రీజియన్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ భానుకిరణ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా మేడారం





వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న ఎమ్మెల్సీ బండా ప్రకాశ్, జంపన్నవాగులోని బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ కింద స్నానమాచరిస్తున్న భక్తులు

(5వ పేజీ తరువాయి)

కాల్వపల్లి, బయ్యక్కపేట, ఊరట్టం, తాడ్వాయి గ్రామాల మీదుగా వచ్చిన వాహనాలను గద్దెలకు సమీపంలోని పార్కింగ్ స్థలాలకు తరలించి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు. దీంతో పార్కింగ్ స్థలాలు కిటకిటలాడాయి.

మేడారం చేరుకున్న లక్నవరం నీరు

గోవిందరరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీరు మేడారానికి చేరుకుంది. మహా జాతర సందర్భంగా ఈ నెల 13న ఇరిగేషన్ అధికారులు లక్నవరం నుంచి నీటిని విడుదల చేశారు. మేడారం జంట వంతెల వరకు నీరు ఆదివారం సాయంత్రం చేరుకుంది.

రేపు గద్దెకు జంపన్న రాక

మేడారం మహాజాతరలో భాగంగా గద్దెకు జంపన్న మంగళవారం చేరుకోనున్నారు. కన్నెపల్లి నుంచి పూజారి పోలెబోయిన సత్యం వారసులు జంపన్నను అంగరంగ వైభవంగా తీసుకొస్తారు. జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెలపై ప్రతిష్ఠిస్తారు. ఈనెల 24న తిరిగి వనప్రవేశం చేయిస్తారు. ప్రభుత్వ లాంచనాలతో ఈనెల 21, 22 తేదీల్లో సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజు గద్దెకు చేరనున్నారు.



కోడితో మొక్కు చెల్లించుకుంటున్న భక్తురాలు

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు



చౌడారం జడ్పీహెచ్ఎస్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 18: మండలంలోని చౌడారం జడ్పీ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. ఆదివారం 2006-07 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు అంతా ఒకదగ్గర కలుసుకున్నారు. 17 సంవత్సరాల నాటి తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందాన్ని పంచుకున్నారు. పరస్పరం కష్టసుఖాలను పంచుకున్నారరు. తమ గురువులైన ఎం.జనార్దన్‌రెడ్డి, డి.నర్సింహారెడ్డి, టి.రామచంద్రం, బి.చొక్కయ్య, దూడల రమేష్, కన్న సోమయ్య, సంపత్‌కుమార్, రాంరెడ్డి, ఆగయ్య, యోగీశ్వరి ని ఘనంగా సన్మానించారు.

కేశ్వాపురంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు..



కేశ్వాపురం జడ్పీహెచ్ఎస్ లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

జనగామ మండలం ఓబుల్ కేశ్వాపురం జడ్పీహెచ్ఎస్‌లో 1996-97 బ్యాచ్ టెన్త్ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పి సమాజ అధ్యయానికి బాటలు వేసిన గురువులను ఘనంగా సన్మానించి అభిమానాన్ని చాటుకున్నారు. జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ ఉద్వేగ్గానికి గురయ్యారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి బేజాడి బీరప్ప తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విద్యామందిర్ ఉన్నత పాఠశాల విద్యార్థులు..



జనగామలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

జనగామ టౌన్: జిల్లా కేంద్రంలోని సంజయ్‌నగర్ శ్రీ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. 2005-06 ఎస్సెస్సీ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు వైఎస్సార్ భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులను సన్మానించి పాఠశాల రోజులను నెమరు వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు నర్సింహులు, జయప్రకాశ్, సోమేశ్వరాచారి, శ్రీను, రాజు, నరేష్, వెంకటస్వామి పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్'ను జయప్రదం చేయాలి

కొడకండ్ల ఫిబ్రవరి 18 : ధూపదీప నైవేద్య అర్చక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమానికి అర్చకులందరు హాజరు కావాలని సంఘం స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.ఎస్.దక్షిణామూర్తి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.4 వేలు పూజా ద్రవ్యాలకు, రూ.6 వేలు పూజారికి గౌరవ వేతనం చొప్పున తెలంగాణాలో మొత్తం 6,500 దేవాలయాలకు ఇచ్చారని అన్నారు. అయితే రూ.6 వేలు అర్చకుల కుటుంబపోషణకు సరిపోక పోగా 3,4 నెలలకు ఒకసారి ఇస్తుండటంతో దేవునికి ధూపదీప నైవేద్యాలు సమర్పించడానికి కూడా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. పైగా గత సంవత్సరం జూన్‌లో నూతనంగా నియమించిన అర్చకులకు ఈ నాటికీ ఒక్కరూపాయి గౌరవ వేతనం కూడా ఇవ్వ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కనీస వేతనం, ఉద్యోగ భద్రతలే ఎజెండాగా ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించి సీఎం రేవంత్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రం ఇస్తామన్నారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే అర్చకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఎలాంటి నినాదాలు చేయకుండా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా శాంతియుతంగా రావాలని ఆయన సూచించారు.

వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా..



● టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 18: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు జిల్లా విద్యాశాఖ సిద్ధమైంది. ప్రభుత్వం పరీక్షల తేదీని ఖరారు చేయడంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు జిల్లా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు నిష్ణాతులతో పాఠాలు బోధిస్తూ వారిలో మానసిక స్థైర్యాన్ని పెంచుతున్నారు. పరీక్షలు ప్రారంభమయ్యే వరకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లేలా చర్యలు చేపట్టారు.

ప్రైవేటుకు దీటుగా ...

ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులు ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారు. వీక్లీ టెస్టులు, మంత్లీ టెస్టులు, రౌండ్ టెస్టులతో పాటు ఈ సారి కొత్తగా ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో పూర్తి సిలబస్ తో ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు.

ఉత్తమ ఫలితాల కోసం..

చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం ఉదయం, సాయంత్రం రోజుకు రెండు పూటలా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పాఠ్యాంశాల వారీగా ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వారంతంలో పరీక్షలు నిర్వహించి వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. సబ్జెక్టుల వారీగా ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేస్తూ విద్యార్థుల్లో ధైర్యాన్ని నింపుతున్నారు.

ఈ సారి ఏడు పేపర్లు ...

టెన్త్ పరీక్షల్లో గతంలో రెండేసి పేపర్లు ఉండేవి. కరోనా పీరియడ్ ముగిసిన తరువాత 2021 నుంచి ఒకే పేపరుతో పరీక్షలు ఒకదాని తరువాత మరొకటి జరుగుతున్నాయి. దీంతో పూర్తి సిలబస్ ఒకేసారి చదవాల్సి రావడంతో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయ సంఘాల పోరాటం, వినతుల మేరకు సైన్స్‌లో రెండు పేపర్లు నిర్వహించేందుకు విద్యాశాఖ సిద్ధమైంది. తెలుగు, హిందీ, ఇంగ్లీషు, గణితం, సాంఘిక శాస్త్రంలో ఒక్కొక్క పేపరు చొప్పున పరీక్ష నిర్వహిస్తుండగా జనరల్ సైన్స్‌ను ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ అని రెండు భాగాలుగా విభజించి రెండు పరీక్షలు రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. దీంతో ఈ సంవత్సరం నుంచి విద్యార్థులు ఏడు పేపర్లకు, ఏడు రోజుల పాటు పరీక్షలు రాయనున్నారు.

పూర్తయిన ప్రత్యేక పరీక్షలు ...

పదో తరగతి విద్యార్థులకు గతంలో కంటే భిన్నంగా ఈసారి ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో అన్ని సబ్జెక్టులకు ప్రత్యేక పరీక్షల పేరుతో పరీక్షలు నిర్వహించారు. ప్రీఫైనల్ పరీక్షల కంటే ముందుగానే ఈ పరీక్షలను నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని అంచనా వేస్తున్నారు. కాగా మార్చి 18 నుంచి పబ్లిక్ పరీక్షలు నిర్వహించనుండగా విద్యార్థులకు పూర్తి స్థాయిలో పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. గత సంవత్సరం జనగామ జిల్లా 94.72 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో 10వ స్థానంలో నిలిచింది. ఈ విద్యా సంవత్సరం మొదటి స్థానం పొందేలా తగు చర్యలు ప్రారంభించింది.

మార్చి 1 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు ..

టెన్త్ విద్యార్థులకు త్వరలో ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. మార్చి 1న తెలుగు (ప్రథమ భాష), 2న హిందీ (ద్వితీయ భాష), 4న ఇంగ్లీషు (తృతీయ భాష), 5న గణితము, 6న ఫిజికల్ సైన్స్, 7న బయోలాజికల్ సైన్స్, 11న సాంఘిక శాస్త్రం సబ్జెక్టులకు పరీక్షలు నిర్వహిస్తారు. జిల్లాలో మొత్తం 6,698 మంది టెన్త్ విద్యార్థులు ఉండగా వారిలో బాలికలు 3,560, బాలురు 3,138 మంది ఉన్నారు.

మెరుగైన ఫలితాలు సాధిస్తాం : కె.రాము, డీఈవో



ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్ఎస్‌సీలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాం. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సిలబస్ పూర్తయింది. రివిజన్ జరుగుతోంది. ప్రత్యేక పరీక్షలు నిర్వహించాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. జిల్లాలో వంద శాతం ఫలితాలే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

వన దేవతల జాతరను విజయవంతం చేయండి: ఈవో

చిలుపూర్, ఫిబ్రవరి 18 : లింగంపల్లిలో జరిగే మినీ మేడారం జాతరను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఈవో చిందం వంశీ పిలుపునిచ్చారు. ఆదివారం జాతర ప్రాంగణంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కండ్లకోలు బాలరాజుతో కలిసి వీఐపీ గేటును ప్రారంభించారు. అనంతరం పారిశుధ్య పనులతో పాటు, మరుగుదొడ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ జాతరను పురస్కరించుకుని ఇప్పటికే సమ్మక్క సారలమ్మ గద్దెలను అలంకరించామని, తాగునీటి వసతి కల్పించామని, మూత్రశాలలు నిర్మిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రాజేందర్ రెడ్డి, వైస్ చైర్మన్ రావులపెల్లి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కంకటి రవీందర్, కంకటి రాజన్న, మోతె శ్రీను, గాజుల రజని, గొడుగు రవి, అపరాధపు రాజు, మంద సిద్దులు, తుత్తూరు రాజు, సందోజు రవింద్రచారి, చాతెల్లి రజాక్, గొడుగు కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



లింగంపల్లిలో మరుగుదొడ్ల పనులను పరిశీలిస్తున్న ఈవో చిందం వంశీ

కరాటేలో కస్తూర్బా బాలికల ప్రతిభ

జాతీయ స్థాయి పోటీల్లో బంగారు, రజత పతకాలు కైవసం



హైదరాబాద్‌లో జఫర్‌గఢ్ కస్తూర్బా విద్యార్థులకు పతకాలు అందిస్తున్న రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ వ్యవస్థాపకురాలు లక్ష్మి



స్టేషన్‌ఘన్‌పూర్ కస్తూర్బా విద్యార్థులను అభినందిస్తున్న 'ఆస్మా' రాష్ట్ర అధ్యక్షుడు మల్లిఖార్జున్ గౌడ్

జఫర్‌గడ్, ఫిబ్రవరి 18 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో జఫర్‌గడ్ కస్తూర్బా బాలికలు అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. నిరంతర శ్రమ, సాధన, పట్టుదలతో విజేతలుగా నిలిచి బంగారు, రజత పతకాలను సాధించి ప్రశంసలందుకున్నారు. రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి ఆధ్వర్యంలో హైద్రాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో బాల బాలికలకు ఆదివారం జాతీయ స్థాయిలో ఓపెన్ కరాటే, కుంఫూ, తైక్వాండో ఛాంపియన్ షిప్ -2024 పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న జఫర్‌గడ్ కస్తూర్బా బాలికల విద్యాలయం విద్యార్థినులు కరాటే విభాగంలో యమున (ఇంటర్ సెకండియర్), రాధిక (8వ తరగతి), పి.వైష్ణవి (9వ తరగతి) స్వర్ణ పతకాలు, అభిలాష, శిరీష (8వ తరగతి), రసన్య, ధనుశ్రీ (10వ తరగతి) రజత పతకాలు సాధించారు. తమ్మడపల్లి(జి)కి చెందిన సాత్విక్ (7వ తరగతి) అనే విద్యార్థి బంగారు పతకాన్ని సాధించాడు. విజేతలకు రుద్రమదేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమి వ్యవస్థాపకురాలు లక్ష్మీ రవి బంగారు, రజత పతకాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నెపు రాజేంద్రం, హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు ఎస్.ఆది లక్ష్మీ, కస్తూర్బా పీఈటీ మహాలక్ష్మీ, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా, విజేతలను కస్తూర్బా ఎస్‌వో స్వప్న, ఉపాధ్యాయులు అభినందించారు.

స్టేషన్‌ఘన్‌పూర్ కేజీబీవి విద్యార్థుల ప్రతిభ

స్టేషన్‌ఘన్‌పూర్: కరాటే టోస్ మినిట్స్ విభాగంలో కేజీబీవి విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని ఆస్మా రాష్ట్ర అధ్యక్షుడు మల్లిఖార్జున్ గౌడ్, సెల్ఫ్ డిఫెన్స్ చైర్మన్ లక్ష్మి అన్నారు. ఆదివారం హైదరాబాద్ కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియంలో జరిగిన కరాటే టోర్నమెంట్లో కటాస్ విభాగంలో 7 సిల్వర్ మెడల్స్, 4బ్రాంచ్ మెడల్స్ కైవసం చేసుకున్న విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించడం శుభపరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కొమురమ్మ, మాస్టర్లు పెసరు సారయ్య, సత్యశంకర్, ఎండి రజాక్, అజయ్, గెలుపొందిన విద్యార్థులు పల్లవి, పూజిత, సౌమ్యశ్రీ, సింధు, హంసిని, శృతి, అనూష, అక్షయ, ఇష్టప్రియ, రేష్మ, జోష్ణవి తదితరులు పాల్గొన్నారు.

మొన్న భార్య, నేడు భర్త..

రోడ్డు ప్రమాదంలో గాయపడి రెండు రోజుల తేడాతో ఇద్దరి మృతి



గడిపె లలిత రవి దంపతులు (ఫైల్)

శాయంపేట, ఫిబ్రవరి 18: బతుకుదెరువు కోసం పల్లెను వదిలి హైదరాబాద్ మునిసిపాలిటీలో స్వపర్‌గా పని చేస్తూ జీవిస్తున్న దంపతులను కారు రూపంలో వచ్చిన మృత్యువు కబలించింది. హైదరాబాద్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని మైలారం గ్రామానికి చెందిన దంపతులు రోడ్డు ప్రమాదానికి గురికాగా భార్య శుక్రవారం మృతి చెందగా చికిత్స పొందుతున్న భర్త సైతం శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా శాయంపేట మండలం మైలారం గ్రామానికి చెందిన దంపతులు గడిపె లలిత(39), గడిపె రవి(48) బతుకుదెరువు కోసం కొద్ది సంవత్సరాల క్రితం హైదరాబాద్ వెళ్లి మునిసిపాలిటీలో స్వీపర్లుగా పని చేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 15న పనిముగించుకుని ద్విచక్రవాహనంపై వస్తుండగా కారు ఢీ కొట్టిన ఘటనలో భార్య లలిత మృతి చెందింది. భర్త రవి కూడా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ ఘటనతో మైలారంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

రైల్లో నుంచి పడి జవాన్ మృతి

ఎల్కతుర్తి (కమలాపూర్), ఫిబ్రవరి 18: కమలాపూర్ మండలం గూడూరు గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ తెప్ప శ్రావణ్‌కుమార్ (35) శనివారం అర్ధరాత్రి రైల్లో నుంచి పడి మృతి చెందారు. మణిపూర్‌లో సీఆర్‌పీఎఫ్ జీడీ - 143 బెటాలియన్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రావణ్ కుమార్ 15 రోజుల క్రితం సెలవులపై స్వగ్రామమైన గూడూరుకు వచ్చారు. తిరిగి విధుల్లో చేరడానికి శనివారం రాత్రి రైల్లో బయలుదేరారు. ఈ క్రమంలో హసన్‌పర్తి మండలం కోమటిపల్లి గేటు వద్ద గుర్తు తెలియని రైల్లో నుంచి పడి మృతి చెందినట్లు కాజీపేట రైల్వే పోలీసులు తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తరలిం చారు. సీఆర్‌పీఎఫ్ అధికారులు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయనకు భార్య కవిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతికి గల కారణాలు పూర్తి స్థాయిలో తెలియాల్సి ఉంది.

అయోధ్య రైలుకు స్వాగతం

జనగామ టౌన్, ఫిబ్రవరి 18: అయోధ్య బాలరాముని దర్శించుకునేందుకు గాను ప్రత్యేక రైలు ఆదివారం జనగామ రైల్వే స్టేషన్ నుంచి బయల్దేరింది. భువనగిరి పార్లమెంటు నియోజకవర్గ భక్తుల కోసం అయోధ్యకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేయగా జనగామ రైల్వేస్టేషన్‌లో రైలుకు బీజేపీ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్తా జెండా ఊపి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రత్యేక బ్యాగులు పంపిణీ చేశారు. అయోధ్యకు వెళ్లేందుకు భక్తులు ఇప్పటికే రైలు టికెట్లను బుక్ చేసుకోగా గుర్తింపుగా వారికి బ్యాగులు అందజేశారు. ఈ రైలు రెండు రోజుల పాటు ప్రయాణించి అయోధ్యకు చేరుకుంటుండగా దర్శనం అనంతరం తిరిగి భక్తులను జనగామ రైల్వే స్టేషన్‌కు చేరుస్తుంది. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సౌడ రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు బెజాడి బీరప్ప, నాయకులు గుజ్జుల నారాయణ, దేవరాయ ఎల్లయ్య, క్రాంతి, కార్తీక్, గోధుమల అశోక్, జంగా నరసింహారెడ్డి, నవీన్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

బెల్టు షాపు నిర్వాహకుడిపై కేసు

తరిగొప్పుల, ఫిబ్రవరి 18: లైసెన్స్ లేకుండా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తరిగొప్పుల మండలం నర్సాపూర్ గ్రామానికి చెందిన ఇరుమల్ల కోటిలింగం తన ఇంట్లో మద్యాన్ని నిల్వచేసి అధిక ధరలకు విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు శనివారం రాత్రి సోదాలు నిర్వహించి రూ.10,390 రూపాయాల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్సై శ్వేత తెలిపారు.

బాధిత కుటుంబానికి చేయూత



యాదగిరి కుటుంబానికి రూ.50 వేలు ఇస్తున్న స్నేహితులు

పాలకుర్తి, ఫిబ్రవరి 18 : మండలంలోని వల్మిడి గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ రామరాజు యాదగిరి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో ఆయన కుటుంబానికి బాల్య స్నేహితులు ఆదివారం రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందచేశారు. వారిలో వీరమల్ల బాబయ్య, రవీందర్, పోతుగంటి నర్సయ్య, తండ మల్లయ్య, దోకురు రాములు, సైదులు, రాజయ్య, తండ యాదగిరి, కాసర్ల యాదగిరి ఉన్నారు.

ఆడపడుచు పెళ్లికి ఆర్థిక సహాయం

తరిగొప్పుల, ఫిబ్రవరి 18: మండలంలోని అక్కరాజుపల్లి గ్రామానికి చెందిన బండ పద్మ వెంకటయ్య దంపతుల కుమార్తె కావేరి వివాహం ఆదివారం జరిగింది. వారికి రెయిన్‌బో యూత్ అసోసియేషన్ వారు రూ. 5000 ఆర్థిక సహాయం అందజేశారు. వారిలో యూత్ సభ్యులు అక్తర్, రాజ్‌కుమార్, హరిప్రసాద్, బైరి రమేష్, తరుణ్, రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

మేడారం బస్ క్యాంపు ప్రారంభం

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 18 : సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకుని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యాంపును ఆదివారం జనగామ డిపో మేనేజర్ జ్యోత్స్న ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులు ఆర్టీసీ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కంట్రోలర్ ఎం. రఘువీర్‌తో పాటు ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెకు చేరిన కరాటే



స్పైరింగ్ చేస్తున్న విద్యార్థులు

నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతున్న గ్రామీణ యువత

పాలకుర్తి, ఫిబ్రవరి 18: కరాటేకు ఇప్పుడిప్పుడే ఆదరణ పెరుగుతోంది. క్రమంగా గ్రామీణ ప్రాంతాలకు సైతం విస్తరిస్తోంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు, యువకులు ఇప్పుడు ఆసక్తి చూపుతున్నారు. మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకునేందుకు ముందుకు వస్తున్నారు. ఒకప్పుడు పట్టణ ప్రాంతాలకే పరిమితం అయిన కరాటే కుంగ్‌ఫూ విద్య నేడు అన్ని గ్రామాలకు పాకుతోంది. గతంలో కంటే ఇప్పుడు ఈ విద్యకు మంచి ఆదరణ లభిస్తోంది. ప్రస్తుత పరిస్థితుల్లో మహిళలు అత్యధికంగా దీనిపై దృష్టిపెడుతున్నారు. రోడ్డు రోమియోల వెకిలి చేష్టలు, లైంగిక వేధింపుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు కరాటే నేర్చుకోవడం అత్యవసరంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలల పాటు కరాటేలో శిక్షణ ఇస్తోంది. పాలకుర్తి మండలం శాతాపురం గ్రామానికి చెందిన బాలూకుమార్ గత కొన్నేళ్లుగా జిల్లాలోని పలు మండలాల్లో శిక్షణా తరగతులు ప్రారంభించి ఇప్పటి వరకు 2000 మందికి శిక్షణ ఇచ్చారు. పలు ప్రభుత్వ, ప్రవేటు పాఠశాల్లో సైతం విద్యార్థులకు వారానికి మూడు రోజులు కరాటే నేర్పుతున్నారు.

కరాటేలో రకాలు..

ఆత్మరక్షణ, మనోధైర్యాన్ని పెంచడంలో కరాటే దోహదపడుతుంది. ఇందులో కుంగ్‌ఫూ, ఒకినోవ, ఐకిడో, షావలిన్ లాంటి రకాలు ఉన్నాయి. ఇవన్నీ చూడడానికి ఒకే రకంగా ఉన్నా స్టైల్‌లో తేడా ఉంటుంది.

పలు మండలాల్లో కరాటేలో శిక్షణ..

మండలంలోని గూడూరుకు చెందిన బాలూకుమార్ పాలకుర్తి, జఫర్‌గడ్, స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల మండలాల్లోని పలు గ్రామాల్లో తరగతులు ఏర్పాటు చేసి 2000 వేల మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. ఆయన వద్ద శిక్షణ తీసుకొని జాతీయ, రాష్ట్ర స్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారు సుమారు 20 మంది వరకు ఉన్నారు. 100 మంది బ్లాక్ బెల్ట్, 200 మంది బ్రౌన్‌బెల్ట్, 300 మంది పర్‌పుల్ బెల్ట్, 500 మంది గ్రీన్, 600 మంది బ్లూ, 300 మంది పసుపు బెల్ట్‌లో శిక్షణ తీసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు..




శిక్షణ పొందుతున్న విద్యార్థులు

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో పాలకుర్తి మండలంలోని సంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, జడ్పీఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్నారు. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పాల్గొంటున్నారు. ఇప్పుడు బాలికలకు కరాటే పట్ల క్రేజీ పెరిగింది.

నిరుపేద విద్యార్థులకు ఉచిత శిక్షణ..


బాలూకుమార్, మాస్టర్, పాలకుర్తి



ఇరవై ఏళ్లుగా పాలకుర్తి, దేవరుప్పుల, జఫర్‌గడ్, మండలాల్లో కరాటే శిక్షణ ఇస్తున్నాను. ఇప్పుడిప్పుడే యువతీ యువకులలో కరాటేపై ఆసక్తి పెరుగుతోంది. నిరుపేద యువకులకు ఉచితంగానే నేర్పిస్తున్నాను. ప్రభుత్వ పాఠశాల్లో కరాటే మాస్టార్లను నియమించాలి.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధిస్తా..


బి.సరస్వతి, బ్లాక్‌బెల్ట్



ఆరేళ్ల నుంచి కరాటే నేర్చుకుంటున్నాను. జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్నాను. బ్లాక్ బెల్ట్‌లో శిక్షణ పూర్తి చేసి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగం సాధించే లక్ష్యంతోనే కరాటే నేర్చుకుంటున్నాను. ప్రస్తుతం బీటెక్ చదువుతున్నాను. తల్లిదండ్రుల ప్రోత్సహంతోనే కరాటేలో శిక్షణ పొందుతున్నాను.

పోలీస్ శాఖలో చేరుతా..

స్వర్ణ, బ్లాక్‌బెల్ట్



హైదరాబాద్‌లో ఫాం డీ మూడో సంవత్సరం చదువుతున్నాను. ఆర్మీలో చేరాలని, దేశానికి సేవ చేయాలనుకుంటున్నాను. ఇప్పుడు బ్లాక్ బెల్ట్ 1 డన్‌లో శిక్షణ తీసుకుంటున్నాను. ఏడేళ్ల నుంచి కుంగ్‌ఫూ కరాటేలో శిక్షణ తీసుకుంటున్నాను. కరాటే శిక్షణతో నాలో ఆత్మవిశ్వాసం పెరిగింది.